సాక్షి
కామారెడ్డి

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



లాభాల బాటలో ఆర్టీసీ

మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోందని రీజినల్ మేనేజర్ జోత్స్న అన్నారు.

- 8లో ▸



వంటా వార్పు..

సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు వంటా వార్పు కార్యక్రమం ద్వారా నిరసన తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.2 /8.5

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా హెచ్‌ఎం స్పందన గురువారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా విధులు నిర్వర్తిస్తున్న స్పందనను ఫుల్ అడిషనల్ చార్జ్(ఎఫ్ఏసీ) కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. స్పందన బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన కే సుజాత బదిలీపై పాల్వంచ మున్సిపాలిటీకి వెళ్లగా, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు.

రెవెన్యూ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా మాణిక్యం



భిక్కనూరు: రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా మండల కేంద్రానికి చెందిన దుబాషి మాణిక్యం ఎన్నికయ్యారు. రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికలను గురువారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగుల, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చేలా ఉద్యోగులను సమాయత్తం చేస్తానని అన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



కామారెడ్డి టౌన్ : సీఎం కప్ టోర్నీలో భాగంగా జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసన పోటీల విజేతలకు గురువారం జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో మెడల్స్, బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథం హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. నిత్యం యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు 21న పరీక్ష

కామారెడ్డి టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆయా పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో దరఖాస్తుదారులకు ఈ నెల 21న పరీక్ష నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి నాగరాణి గురువారం ఒక ప్రటనలో తెలిపారు. అభ్యర్థులకు పరీక్ష హాల్ టికెట్‌లను ఇది వరకే పోస్ట్ ద్వారా పంపించినట్లు పేర్కొన్నారు. హాల్ టికెట్స్ అందని వారు నేరుగా జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో డూప్లికేట్ హాల్ టికెట్‌ను తీసుకోవచ్చని సూచించారు. కోర్టులో ఖాళీలుగా ఉన్న స్టెనో, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ ఒక్కో పోస్టు భర్తీకి పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారా లీగల్ వలంటీర్ల ఎంపికకు నోటిఫికేషన్..

కామారెడ్డి క్రైం : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్ల ఎంపికకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. పదో తరగతి అర్హత కలిగి 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుకాగా, అభ్యర్థులు ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొని ఉండకూడదు. అలాగే క్రిమినల్ కేసులు ఉండకూడదు. పారా లీగల్ వలంటీర్లకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని, రాష్ట్ర అథారిటీ నిర్ణయించిన గౌరవ వేతనం చెల్లిస్తారని కోర్టు సిబ్బంది తెలిపారు. ఈనెల 26వ తేదీ లోగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

హడలెత్తిస్తున్న తనిఖీలు



కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం.. అన్న చందంగా తయారైంది వాహనాల తనిఖీ వ్యవహారం. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు అంటూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు జిల్లాలో వాహనాల తనిఖీ విస్తృతంగా చేపడుతుండగా, రోడ్డెక్కితే చాలు తమను పోలీసులు ఆపుతున్నారని.. ఏదో ఒక కారణాన్ని చూపుతూ జరిమానా విధిస్తున్నారని వాహనదారులు అంటున్నారు. వాహనాల తనిఖీ సమయంలో కొందరు వాహనదారులు పోలీసు సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు.

- ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు
- రోడ్డెక్కితే జరిమానా కట్టాల్సిన పరిస్థితి
- ఫ్యామిలీతో వెళ్తున్నా బండి ఆపాల్సిందే..
- స్థానికంగా తిరిగే వాళ్లనూ వదలడం లేదు
- ప్రమాదాల నియంత్రణకే అంటున్న శాఖ అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ట్రాఫిక్ నిబంధనల పేరుతో పోలీసులు చేపడుతున్న వాహనాల తనిఖీలతో జనాలు హడలెత్తుతున్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను ఆపుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఏదో అర్జంట్ పని మీద హడావుడిలో బండి తీసి బయటికి వెళ్తే జరిమానా కట్టాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. పండుగ పూట భార్యతో కలిసి గుడికి వెళ్తున్నా వదలడం లేదని కొందరు, ఇంటి నుంచి కార్యాలయానికి, దుకాణాలకు వెళ్లే వారికీ వితవుట్ హెల్మెట్ అంటూ ఫైన్లు వేస్తున్నారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోకల్‌గా తిరిగేటప్పుడు హెల్మెట్ పెట్టుకుని వెళ్లలేమని వాహనదారులు పలుమార్లు పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఘటనలున్నాయి. తాడ్వాయి మండల కేంద్రంలో ఇద్దరు యువకులు గ్రామంలోని వైన్ షాప్ పర్మిట్ రూం వద్ద మద్యం సేవించి వెళ్తుండగా పోలీసులు ఆపడం, వదిలేయాలని కోరితే పోలీసులు వినకపోవడంతో జరిగిన గొడవతో ఓ యువకుడు పోలీస్ స్టేషన్ ఆవరణలోని చెట్టు ఎక్కి దూకడంతో అపస్మారక స్థితికి చేరుకున్న విషయం తెలిసిందే. వాహనాల తనిఖీ సమయంలో జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో నిత్యం ఏదో ఒక వివాదం, గొడవ జరుగుతూనే ఉంది. దీంతో పోలీసులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు విధించిన టార్గెట్లు రీచ్ కావాలంటే రెగ్యులర్‌గా వాహనాలు తనిఖీ చేయాల్సిన పరిస్థితి ఉంది.

తలనొప్పి వ్యవహారం

తనిఖీల వ్యవహారం వాహనదారులతోపాటు పోలీసులకూ తలనొప్పిగా మారుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనల అమలు కోసం పోలీసులు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహిస్తుండగా, రోడ్లపై పోలీసులను చూస్తున్న వాహనదారులు విసుగెత్తి వారితో వాగ్వాదానికి దిగుతున్నారు. స్థానికంగా తిరిగే వాళ్లను కూడా ఇబ్బంది పెడుతున్నారంటూ నిరసన తెలుపుతున్నారు. భార్యాపిల్లలతో కలిసి వెళ్తున్నప్పుడు కూడా పోలీసులు ఆపి ఇబ్బంది పెడుతున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌కు వెళ్లిన సమయంలో వాహనాలను పార్కింగ్ చేయడానికే స్థలం ఉండడం లేదని, అదే సమయంలో హెల్మెట్ లేదంటూ ఫొటోలు తీసి జరిమానా విధిస్తున్నారంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రతీ రోజూ తనిఖీలు చేపడుతున్నారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాపిక్ నిబంధనలు పాటించకపోవడమేనని, తనిఖీలతోనైనా మార్పు వస్తుందనే ఉద్దేశంతో రెగ్యులర్ తనిఖీలు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలను నడుపుతున్న వారిని ఆపి జరిమానా విధించాల్సిన పోలీసులు.. కుటుంబ సభ్యులతో వెళ్తున్న వారిని, కూరగాయల మూటలతో వెళ్తున్న వారిని ఆపి జరిమానా విధిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలతో పాటు బిచ్కుంద, పిట్లం, మద్నూర్, లింగంపేట, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, తాడ్వాయి, రాజంపేట, గాంధారి తదితర మండల కేంద్రాల్లో నిత్యావసరాలు, కూరగాయల కొనుగోలు కోసం, ఇతర పనుల కోసం వెళ్లే వారిలో చాలా మంది పోలీసుల తనిఖీల సందర్భంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పోలీసు కనిపిస్తే ఆగిపోవడమే..

రోడ్ల మీద పోలీసులు కనిపించగానే వాహనదారులు ముందుకు వెళ్లకుండా ఎక్కడివారు అక్కడే ఆగిపోతున్నారు. కొన్ని సార్లు పోలీసులు వెళ్లిపోయే వరకు చెట్ల కింద సేద తీరుతున్నారు. మరికొందరు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్తున్నారు. కేకేవై రోడ్డుపై మాచారెడ్డి, కామారెడ్డి, తాడ్వాయి, లింగంపేట, ఎల్లారెడ్డి పోలీసు స్టేషన్ల పరిధిలో నిత్యం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులు కనిపించగానే రోడ్డుకు ఇరువైపులా సుమారు 40 నుంచి 50 వాహనదారులు ఆగిపోతున్నారు. పోలీసులు వెళ్లేవరకు అక్కడే ఉంటున్నారు. ప్రతి రోజూ కనిపించే దృశ్యమిది. భిక్కనూరు పోలీసులు 44వ నంబరు జాతీయ రహదారిపై టోల్ గేట్ వద్ద వాహనాలను ఆపుతున్నారు. మిగతా అన్ని రూట్లలోనూ ఇదే పరిస్థితి ఉంటోంది. పండగల పూట కూడా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండడంతో వాహనదారులు ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తిపోస్తున్నారు.

స్థానికులనూ వదలని వైనం

జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వెళ్లే రోడ్డులో ఎక్కడో ఓ చోట పోలీసులు వాహనాలను ఆపుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో వాహనాల పార్కింగ్‌కు స్థలం చూపకుండా ట్రాఫిక్ నిబంధనల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే రైతులు కూడా తనిఖీలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది హెల్మెట్‌లు ధరిస్తున్నా, డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్‌సీలు అంటూ పోలీసులు వారిని ఆపుతున్నారు. దీంతో పోలీసులు కనబడితే చాలు వేరే రోడ్ల గుండా వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలోని ఇతర పట్టణాలు, మండలాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ రూల్స్ పేరుతో ఇబ్బందులు పెట్టొద్దని వాహనదారులు కోరుతున్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి రోడ్డు పక్కన ఆగిపోయిన వాహనదారులు (ఫైల్)



గురువారం ఉదయం విద్యార్థులు డ్రైయినేజీలో పారబోసిన అన్నం

ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

- బాన్సువాడ ఆస్పత్రికి ఇద్దరి తరలింపు
- గురువారం ఉదయం నుంచే ఉడికీఉడకని అన్నం అందజేత
- సాయంత్రం ఫుడ్ పాయిజన్ బారిన పడిన విద్యార్థులు
- వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు



ఆస్పత్రిలో రోదిస్తున్న విద్యార్థి బహదూర్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు నలుగురు గురువారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఎనిమిదో తరగతి చదువుతున్న బహదూర్‌సింగ్, జగన్ తీవ్రమైన కడుపునొప్పి బారినపడడంతో అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఉడికీఉడకని అన్నం పెట్టడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విద్యార్థులు తెలిపారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

గురువారం ఉదయం నుంచే..

ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రస్తుతం 98 మంది విద్యార్థులు ఉంటున్నారు. గురువారం ఉదయం 8 గంటలకు విద్యార్థులకు భోజనం అందించారు. అన్నం ఉడకకపోవడంతో విద్యార్థులు దానిని మురికి కాలువలో పారబోసి ఖాళీ కడుపులతో పాఠశాలకు వెళ్లిపోయారు. సాయంత్రం మళ్లీ అదే రకం భోజనం అందించడంతో తప్పని పరిస్థితుల్లో తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇక్కడ పెడుతున్న అన్నం తినలేకపోతున్నామని ఓ విద్యార్థి తెలిపాడు. బుధవారం రాత్రి పెట్టిన చికెన్ కర్రీ సగం మందికి కూడా సరిపోలేదని, మిగతా వాళ్లు ఉపవాసం ఉన్నారని అన్నాడు. గురువారం ఉదయం సరైన భోజనం పెట్టకపోవడంతో అలాగే పాఠశాలకు వెళ్లిపోయామని తెలిపాడు. గురువారం ఉదయం విద్యార్థులకు అందించిన భోజనంపై వార్డెన్ రాజేందర్‌ను వివరణ కోరగా.. తనకు రెండు హాస్టల్స్ ఉన్నాయని, పిట్లం హాస్టల్‌కు ఇన్‌చార్జీనని తెలిపాడు. రెండు హస్టళ్లు చూసుకోవాడం ఇబ్బందవుతోందన్నారు. ప్రస్తుతం ఇచ్చిన బియ్యం కొత్తవి కావడంతో సమస్య తలెత్తిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని అన్నారు.



ఆస్పత్రిలో విద్యార్థి జగన్

పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అధికారులకు బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి సూచన
- నిజాంసాగర్, పిట్లం మండలాల్లో సర్వే పరిశీలన



నిజాంసాగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్/పిట్లం(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎటువంటి తప్పిదాలు లేకుండా పక్కాగా చేపట్టాలని బాన్సువాడ సబ్ కలెక్టర కిరణ్మయి అధికారులకు సూచించారు. నిజాంసాగర్ మండలం బంజపల్లిలో, పిట్లం మండల కేంద్రంలో గురువారం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాలన్నారు. పిట్లంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్రోల్ పంప్ స్థలాన్ని పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట ఎంపీడీవోలు గంగాధర్, కమలాకర్, తహసీల్దార్లు భిక్షపతి, వేణుగోపాల్, ఎంపీవో అనిత ఈజీఎస్ సిబ్బంది ప్రభాకర్, కారోబార్ సాయిలు తదితరులున్నారు.

సామాజిక భూమికలే సాహిత్య ఉద్యమాలకు పునాది



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కాసీం

తెయూ (డిచ్‌పల్లి): సామాజిక భూమికలే సాహిత్య ఉద్యమాలకు పునాదులని ప్రముఖ కవి, విమర్శకులు ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసీం తెలిపారు. దీనికనుగుణంగా తెలుగు సాహిత్యంలో సంఘ సంస్కరణ, జాతీయోద్యమం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ సాహిత్యం, స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీ, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు వచ్చాయన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో తెలుగు విభాగం, సెంట్రల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లాంగ్వేజీస్ (భారతీయ భాషా విభాగాల సంస్థ), రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు అధ్యాపకులకు నిర్వహిస్తున్న పునశ్చరణ తరగతులు రెండోరోజు గురువారం కొనసాగాయి. కార్యక్రమంలో కాసీం మాట్లాడుతూ.. చారిత్రక, రాజకీయ పరిస్థితులు సమాజ పరిణామాన్ని నిర్ణయిస్తే సాహిత్యం దాన్ని రచన ద్వారా తెలియపరుస్తుందన్నారు. వీటన్నింటికి కవిత్వంలో వచ్చిన స్పందనలే కవితోద్యమాలు అవుతాయన్నారు.

రచయిత్రి యుద్ధనపూడి రెడ్డి శ్యామల ప్రసంగిస్తూ.. నిఘంటువులు ఎలా తయారు చేస్తారు. తెలుగులో ఇప్పటిదాకా వచ్చిన పద్య నిఘంటువులు, కారాది నిఘంటువులు అంటే ఏమిటి అనే అంశాలను వివరించారు. ప్రముఖ విమర్శకులు గుంటూరు లక్ష్మీనర్సయ్య ప్రసంగిస్తూ.. సాహిత్య విమర్శలో పలు పద్ధతులను పరిచయం చేశారు. నిర్వాహకురాలు కరిమండ లావణ్య, సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు లక్ష్మణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిరంతరం సాగాలి

- నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడొద్దు
- అనధికార హోర్డింగ్‌లను తొలగించాలి
- వందశాతం పన్ను వసూలు చేయండి
- మున్సిపల్ అధికారులకు కలెక్టర్ సంగ్వాన్ ఆదేశాలు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మున్సిపాలిటీల పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శానిటేషన్, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, పన్ను వసూళ్లు, అమృత్ పథకం, ఇంజినీరింగ్ పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకం, వీధి లైట్లు, ఇంటింటి చెత్త సేకరణ, అడ్వర్టైజ్‌మెంట్ పన్ను వసూళ్ల తదితర అంశాలపై జిల్లాలోని మున్సిపాలిటీల అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా చెత్త సేకరించాలని, నాటిన మొక్కలకు ప్రతి రోజూ రెండు పూటలా నీటిని అందించాలన్నారు. ఇందు కోసం రూట్ వారీగా సిబ్బందికి డ్యూటీలు వేయాలని సూచించారు. నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద మంజూరైన నిధులతో పనులు పూర్తిచేసి ఫొటోలు, నిధుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆదేశించారు. పట్టణాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించాలన్నారు. అనుమతులు ఉన్న వాటికి అడ్వర్టైజ్‌మెంట్ చార్జీలు వసూలు చేయాలని సూచించారు. నర్సరీల్లో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచాలని, వీధి లైట్లు వెలిగేలా పర్యవేక్షించాలని అన్నారు.

సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ లు శ్రీహరి, స్పందన, మున్సిపల్ ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హైవేపై పిండి బస్తాల వ్యాన్ బోల్తా

భిక్కనూరు: గోధుమ పిండి బస్తాల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వెనుక ప్రాంతంలోని జాతీయ రహదారిపై గురువారం బోల్తాపడింది. హైదరాబాద్ నుంచి భీమ్‌గల్‌కు పిండి బస్తాల లోడ్‌తో వెళ్తుండగా టైరు పేలడంతో అదుపుతప్పి వ్యాన్ బోల్తాపడింది. వ్యాన్‌తోపాటు పిండి బస్తాలు రోడ్డుపై అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న జీఎంఆర్ సిబ్బంది పొక్లెయినర్‌ను రప్పించి బోల్తాపడి వ్యాన్‌ను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్

కామారెడ్డి టౌన్: రీజియన్ పరిధిలో శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రీజినల్ మేనేజర్ జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను, సూచనలను సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు ఆయా డిపోల మేనేజర్ల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్‌ఎం – 99592 26011, కామారెడ్డి డిపో – 99592 26018, బాన్సువాడ డిపో – 99592 26020, ఆర్మూర్ డిపో – 99592 26019, బోధన్ డిపో – 99592 26001, నిజామాబాద్ -1 డిపో – 99592 26016, నిజామాబాద్ -2 డిపో – 99592 26017 నంబర్లకు ఫోన్ చేయాలని, ఆర్టీసీ ప్రయాణికులు డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నస్రుల్లాబాద్(బాన్సువాడ): రిజిస్ట్రేషన్‌ల కోసం తహసీల్ కార్యాలయానికి వచ్చిన వారు సాంకేతిక సమస్య కారణంగా గురువారం పడిగాపులు కాశారు. స్లాట్ బుక్ చేసుకుని వచ్చినా గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అసహనం వ్యక్తం చేశారు. మొత్తం ఏడు స్లాట్‌లు బుక్ కాగా వారంతా సాయంత్రం 5గంటల వరకు వేచి చూసి ఎట్టకేలకు తమ పని పూర్తి చేసుకుని వెళ్లారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తాము గంటల తరబడి ఎదురు చూశామని అన్నారు.

క్లుప్తంగా

'ప్రశాంతంగా ఉండటం అలవర్చుకోవాలి'



కామారెడ్డి టౌన్: ప్రతి ఒక్కరు మానసికంగా ప్రశాంతంగా ఉండటం అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కళా భారతిలో మున్సిపల్, బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రాజయోగ ధ్యాన్య అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపల్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు నిత్యం కాసేపు ధ్యానం చేయాలన్నారు. హైదరాబాద్ ఓం శాంతి ప్రతినిధి అంజలి దీదీ, కామారెడ్డి ప్రతినిధులు రజిని, సంతోషి, చంద్రకళ, అనిల్, జయ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'సర్వేలో ఎలాంటి తప్పులు ఉండొద్దు'



గాంధారి(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఇంటింటికి తిరిగి పక్కాగా చేపట్టాలని, సర్వేలో ఎలాంటి తప్పులుండొద్దని,నిజమైన అర్హులను గుర్తించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం ఆయన మండలంలో పర్యటించారు. పిష్కిల్‌గుట్ట తండాను సందర్శించి సర్వేను పరిశీలించారు.ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో రాజేశ్వర్,డీటీ రవి సిబ్బంది ఉన్నారు.

చోరీ సామగ్రి విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: మున్సిపల్‌కు సంబంధించిన బోరు మోటార్లు, విడి భాగాలు, ఎలక్ట్రికల్ మెటీరియల్ తదితర సామగ్రిని దొంగతనంగా విక్రయించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని 8, 27, 44వ వార్డుల కౌన్సిలర్లు నిట్టు కృష్ణమోహన్, అపర్ణ, ప్రముఖులు గురువారం మున్సిపల్ కమిషనర్ స్పందనకు ఫిర్యాదు చేశారు. ఎల్లమ్మ సంప్, గడి వాటర్ ట్యాంక్, బుర్ర మత్తడి, వాటర్‌వర్క్ కార్యాలయం వద్ద సుమారు 12 ట్రాక్టర్‌ల ట్రిప్పులకు పైగా ఉన్న విలువైన సామగ్రికి ఇటీవల నూతన ఫిల్టర్ బెడ్ వద్దకు చేర్చారని తెలిపారు. అక్కడి నుంచి కొందరు వ్యక్తులు మున్సిపల్ అధికారుల సహకారంతో నిబంధనలకు విరుద్ధంగా దొంగతనంగా విక్రయించారని తెలిపారు. ఈవిషయంపై తక్షణమే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఆత్మహత్యకు యత్నించిన గంగాధర్ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. తాడ్వాయికి చెందిన కీసరి గంగాధర్ బుధవారం మద్యం తాగి పోలీసులు చూస్తుండగానే పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న చెట్టుపైకి ఎక్కి కిందకి దూకి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. వెంటనే అతడిని పోలీసులు హైదరాబాద్‌కు తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారన్నారు. తీవ్రంగా దెబ్బలు తగలడంతో అతడికి ఒక చెయ్యి, ఒక కాలు పనిచేయడం లేదని తెలిసింది.

ఆకలి చదువులు

- ప్రారంభమైన 10వ తరగతి ప్రత్యేక తరగతులు
- స్నాక్స్ లేక ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు
- దాతల కోసం ఎదురుచూపులు



ఆర్గొండ పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

రాజంపేట: పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు రోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం వచ్చిన పదవ తరగతి విద్యార్థులు సాయంత్రం ప్రత్యేక తరగతులు పూర్తి అయ్యేవరకు ఆకలితో అలమటిస్తూ చదవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మండలంలో ఎక్కడా కూడా సాయంత్రం పూట స్నాక్స్ అందించడం లేదు.

నవంబర్‌లో మొదలైన ప్రత్యేక తరగతులు

నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి విద్యార్థులకు ఎలాంటి స్నాక్స్ అందించడం లేదు. ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలనే ఆశయంలో ప్రత్యేక తరగతులు ప్రారంభించడం బాగానే ఉన్నా స్నాక్స్ అందించడం కోసం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం విచారకరం. జిల్లా విద్యాశాఖ పదవతరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

రాజంపేటలో..

రాజంపేటలో 7 జిల్లా పరిషత్ పాఠశాలు, ఒక కేజీబీవి పాఠశాల ఉండగా ఇందులో 311 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారు. రాజంపేట, కొండాపూర్ , ఆర్గొండ, గుండారం వంటి పాఠశాలలో పక్క ఊరి గ్రామాల విద్యార్థులు సైతం ఉన్నత పాఠశాలకు వచ్చి పదవ తరగతి చదువుతున్నారు. టెస్ట్ విద్యార్థులు ఉదయం వేళ పాఠశాలకు వచ్చి సాయంత్రం వరకు పస్తులతో ఉంటున్నారు. పదో తరగతి విద్యార్థులకు రోజూ సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

స్నాక్స్ అందిస్తే బాగుంటుంది



పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి స్నాక్స్ అందేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. స్నాక్స్ అందించడం ద్వారా మాలో చదవాలనే ఉత్సాహం పెరుగుతుంది.

–గౌస్, విద్యార్థి

దాతలు ముందుకు రావాలి



పదవతరగతి విద్యార్థులకు స్నాక్స్ అందించే విషయంలో స్థానిక ప్రజాప్రతిధులు, సంఘ సేవకులు వంటి వారు ముందుకు వచ్చి స్నాక్స్ అందిస్తే బాగుంటుంది. లేదా విద్యాశాఖ ప్రత్యామ్నాయ ఆలోచన చేసి స్నాక్స్ అందించేలా చూడాలి.

–భానుశ్రీ , విద్యార్థిని

'వంటా వార్పు'తో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



జిల్లా కేంద్రంలో రోడ్డుపై భోజనాలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె శిబిరం వద్ద ఉద్యోగులు వంటా వార్పు కార్యక్రమంతో నిరసన తెలిపారు. అక్కడే రోడ్డుపై బైఠాయించి భోజనాలు ఆరగించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. బడుల్లో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులను రోడ్డుపైన భోజనం చేసేలా ప్రభుత్వం చేసిందని విమర్శించారు. 10 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షులు వాసంతి, నాయకులు రాములు, సంతోష్‌రెడ్డి, శ్రీధర్, దామోదర్, శైలజ, తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పదాల రవీందర్ మాధవ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.

ఆంగ్ల ఉపాధ్యాయుల మద్దతు



నిజాంసాగర్(జుక్కల్): సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు గురువారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఆంగ్ల ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్ మండలాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులకు మహమ్మద్ నగర్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వచ్చిన ఉపాధ్యాయులు ఫ్లకార్డులతో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు మద్దతు పలికారు.

విధుల్లో చేరిన మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌కు నూతనంగా 34 మంది వార్డు ఆఫీసర్లను మున్సిపల్ శాఖ నియమించగా గురువారం వారిలో 14 మంది విధుల్లో చేరారు. ఇన్‌చార్జి మేనేజర్ గంగాకిషన్‌కు రిపోర్ట్ చేయగా.. వారికి వార్డులను కేటాయించారు. మిగతా 20 మంది ఆఫీసర్లు రెండు రోజుల్లో విధుల్లో చేరతారని అధికారులు తెలిపారు.

చిరుత సంచారం.. భయాందోళనలో ప్రజలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కంచుమల్ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సీతాయిపల్లి, కంచుమల్ మార్గమధ్యలో రోడ్డుపై బుధవారం రాత్రి పలువురికి చిరుతపులి కనిపించినట్లు వాహన చోదకులు తెలిపారు. దీంతో స్థానిక గ్రామాల ప్రజలు జంకుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి చిరుతపులిని బంధించాలని కోరుతున్నారు.

దైవభక్తితో కష్టాలు దూరం



నిజాంసాగర్(జుక్కల్): దైవభక్తి మార్గంలో ముందుకు వెళ్తున్న వారి కష్టాలను భగవంతుడు దూరం చేస్తాడని అనంత శ్రీవిభూషిత జగద్గురు రామానందచార్య నరేంద్రచార్య మహరాజ్ అన్నారు. గురువారం జుక్కల్ మండలం దోస్త్‌పల్లిలో తెలంగాణ ఉప పీఠంలో నరేంద్రచార్య మహరాజ్ భక్తులకు మార్గదర్శనం చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు

ప్రభుత్వ మానసిక వైద్యాధికారి రమణ



మాట్లాడుతున్న డాక్టర్ రమణ

కామారెడ్డి టౌన్: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని జిల్లా ప్రభుత్వ మానసిక వైద్యాధికారి జి. రమణ సూచించారు. గురువారం దేవునిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మానసిక సమస్యలను అధిగమించాలన్నారు. వయసు రీత్యా వచ్చే ప్రేమ సంబంధిత ఆకర్షణలకు గురికావద్దన్నారు. మొబైల్ ఫోన్‌కు బానిసగా మారవద్దని కేవలం సమాచార సేకరణకు మాత్రమే వినియోగించాలని సూచించారు. విద్యార్థులు తప్పుదోవ పడితే చదువుపై శ్రద్ధ తగ్గిపోయి భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని వివరించారు. ఆందోళన, నిరాశ, నిస్పృహ, అతి కోపం, నిద్రలేమి, అతి నిద్రలాంటి లక్షణాలు ఉంటే తక్షణమే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌ను, సైక్రియాలజిస్టును సంప్రదించాలని సూచించారు. లేదా 14416 ఉచిత కాల్ సెంటర్‌కు సంప్రదించి కౌన్సిలింగ్ పొందవచ్చన్నారు. ప్రిన్సిపల్ వనితారెడ్డి, జిల్లా సోషల్ వర్కర్ రాహుల్, దేవకృప, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ముందుంటాం

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థులతో కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: పర్యావరణ పరిరక్షణలో కామారెడ్డి జిల్లా ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, తెలంగాణ విద్యా శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా కామారెడ్డి కలెక్టరేట్‌లో లీడ్ ఎర్త్ లీడర్స్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీజీఆర్ సంస్థ, విద్యార్థులను భాగస్వాములను చేసి చేపట్టిన పర్యావరణ కార్యక్రమాలను అభినందించారు. సీజీఆర్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి, ఆచార్య ఉపేందర్ రెడ్డి, వందేమాతరం రవీంద్రలు పర్యావరణ ఉపన్యాసాలతో విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు. డీఈవో రాజు, డీఆర్‌డీవో సురేందర్, ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ రామకృష్ణ, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ జ్యోతి, డీపీవో తిరుమల ప్రసాద్‌లు హాజరయ్యారు. జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సీజీఆర్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి యానాల వెంకట్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు .

'ఆర్టీసీ డిపోలు లాభాల బాటలో నడుస్తున్నాయి'



మొక్కలు నాటుతున్న ఆర్ఎం జోత్స్న

బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ డిపోను గురువారం రీజినల్ మేనేజర్ జోత్స్న సందర్శించారు. డిపోలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. డిపోలో అన్ని విభాగాలతోపాటు రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఆర్టీసీ డిపోలు లాభాల బాటలో నడుస్తున్నాయని అన్నారు. డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, డిపో మేనేజర్ సరితాదేవి, సూపరింటెండెంట్ బసంత్ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



కామారెడ్డి టౌన్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి దయానంద్ ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలను సందర్శించారు. కామన్ డైట్ మెనూ ప్రకారం వడ్డిస్తున్న ఆహారాన్ని, వంట గదిలో సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వ వైద్యాధికారులు సంతోష్ కుమార్, మమతలు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వివరాలను సేకరించారు. ప్రిన్సిపల్ ఇంతియాజ్ అలీ, డిప్యూటీ వార్డెన్ ఆరిఫ్, ఉన్నారు.

ఫిర్యాదుపై విచారణ

రాజంపేట: ప్రజావాణిలో వచ్చిన ఓ ఫిర్యాదు మేరకు గురువారం రాజంపేట గ్రామాన్ని ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ సందర్శించారు. బస్టాండ్ ప్రాంగణంలోని ఎస్‌బీఐ బ్యాంకు భవన పరిధిలో గల డ్రెయినేజీ సమస్య గురించి విచారణ చేశారు. ఆర్ అండ్‌బీ ఏఈతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం తగు సూచనలు అందజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రఘురాం ఉన్నారు.

నేడు పోతంగల్ కలాన్‌కు కలెక్టర్ రాక

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పోతంగల్ కలాన్ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పర్యటిస్తారని ఎంపీడీవో రాజేశ్వర్ గురువారం తెలిపారు. ప్రధానంగా కర్ణంగడ్డతండాలో నెలకొన్న సమస్యలను పరిశీలించే అవకాశం ఉందని ఎంపీడీవో పేర్కొన్నారు.

క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి: క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ కోరారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో చర్చి ఫాదర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను నిర్వహించుకునేందుకు నిధులు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే సమక్షంలో ఫీస్ట్ పండగను ఆనందంగా జరుపుకోవాలని అన్నారు.

క్రైం కార్నర్

జంగంపల్లిలో ఒకరి ఆత్మహత్య



బందెల శివరాజ్ (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. జంగంపల్లి గ్రామానికి చెందిన బందెల శివరాజ్ (45) గత రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నొప్పి తగ్గలేదు. ఈక్రమంలో బుధవారం రాత్రి శివరాజ్ వ్యవసాయబావి వద్ద గల మేకల కొట్టం వద్దకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అనంతరం కొట్టంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అతడి భార్య లక్ష్మి వెళ్లి చూడగా శివరాజ్ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తించి బంధువులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న భిక్కనూరు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పంచనామ నిర్వహించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని హజ్గుల్ మంజీరా నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై మోహన్‌రెడ్డి బిచ్కుంద శివారులో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించామని, ఎవరైన అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా దాచిన కలప..

ఎల్లారెడ్డి: జాన్కంపల్లి ఖుర్దు గ్రామ శివారులో అక్రమంగా దాచి ఉంచిన టేకు కలపను పట్టుకుని సీజ్ చేసినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్ నాయక్ గురువారం తెలిపారు. గ్రామ శివారులోని పంట పొలంలో అక్రమంగా కలప దాచి ఉంచారన్న సమాచారం రావడంతో అటవీశాఖ సిబ్బందితో దాడులు నిర్వహించి, గ్రామానికి చెందిన గొల్ల నారాయణ పొలంలో దాచిన టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

దేవునిపల్లిలో బైక్ చోరీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి బైక్ చోరీ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని దుంపల దత్తుకు చెందిన టీఎస్ 17ఎల్ 4987 నెంబర్ గల బైక్ ఇంటి ఆవరణలో నిలిపి నిద్రించగా, గురువారం లేచి చూసేసరికి చోరీకి గురైందన్నారు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

రేషన్ బియ్యం కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల అశోక్ నగర్‌లో రేషన్ బియ్యం తరలింపు కేసులో సమీర్‌ను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారం క్రితం కేసు నమోదు అయినట్లు సమాచారం.

బైక్ దహనం

మాక్లూర్: మండలంలోని గుంజ్లి గ్రామంలో ఇంటి ఎదుట ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారని మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామంలోని కురుమ పత్తేపూర్ కిషన్‌కు చెందిన బైక్ ఇంటి ఎదుట ఉంచగా బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. బైక్‌కు అంటుకున్న మంటలతో ఇంటి కిటికీ కాలిపోయి ఇంట్లోకి పొగలు రావడంతో ఇంట్లోని వారు మేల్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కిషన్ ఇటీవల ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లగా అతని కుమారుడు బైక్‌ను నడుపుకుంటున్నాడు.

బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో

- ఒకరి మృతి



లక్ష్మణ్(ఫైల్)

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లారం గండీలో బైక్‌ను ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఒకరు మృతిచెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. వివరాలు ఇలా.. మోస్రా మండలానికి చెందిన కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్(23) అనే యువకుడు గురువారం మధ్యాహ్నం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్తుండగా మల్లారం గండీ వద్ద ఓ ట్రాలీ ఆటో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మన్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ట్రాలీ ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడి అన్న రాహుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఎంఈవో మృతి



జెతాలాల్ (ఫైల్)

మాచారెడ్డి: పాల్వంచ మండల విద్యాధికారి జెతాలాల్ (58) ఇటీవల అనారోగ్యానికి గురికాగా, గురువారం చికిత్స పొందుతూ మృతిచెందారు. అతడికి రెండు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందతూ గురువారం ఉదయం మృతి చెందారు. భవానీపేట తండాలో జరిగిన అంత్యక్రియల్లో డీఈవో రాజు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆరెపల్లి ఉన్నత పాఠశాల పీజీ హెచ్ఎంగా పనిచేస్తున్న జెతాలాల్ ఇటీవల పాల్వంచ ఎంఈవోగా నియమితులయ్యారు.

బడా పహడ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి..




వర్ని: మండలంలోని బడా పహడ్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందినట్లు వర్ని ఎస్సై రమేష్ గురువారం తెలిపారు. మృతుడికి సుమారు 70 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, గత వారం రోజులుగా బడాపహడ్ ప్రాంతంలో బిక్షాటన చేస్తున్నాడని తెలిపారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడం లేదా అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చునని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కట్నం కోసమే హత్య చేశారు

- మృతిచెందిన ఫోక్ సింగర్ శృతి తల్లిదండ్రుల ఆరోపణ

వర్ని: తమ కుమార్తెను కట్నం కోసమే అత్తింటివారు హత్యచేశారని ఫోక్ సింగర్ శృతి తల్లిదండ్రులు ఒక ప్రకటనలో ఆరోపించారు. మోస్రా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ శృతి (22) సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి గ్రామానికి చెందిన దయాకర్ ఇన్‌స్టాగామ్‌లో పరిచయమవగా, ప్రేమించుకున్నారన్నారు. గత నెల 24న వారు వివాహం చేసుకోగా నాటి నుంచి కట్నం తీసుకురావాలని తమ కూతుర్ని భర్త దయాకర్‌తో పాటు వారి తల్లిదండ్రులు వేధించారని, ఈవిషయాన్ని ఫోన్‌లో తమ కూతురు చెప్పి రోధించినట్లు శృతి తల్లి శ్యామల తెలిపారు. బుధవారం తెల్లవారుజామున శృతిని భర్త, అత్తమామలు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని వీరిపై జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు శృతి తండ్రి రమేష్ వెల్లడించారు. గురువారం సాయంత్రం శృతి అంత్యక్రియలు స్వగ్రామమైన తిమ్మాపూర్‌లో నిర్వహించారు.

ఫేక్ ఎస్బీఐ యాప్‌తో మోసం.. డబ్బుల స్వాహా..



సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్

నందిపేట్(ఆర్మూర్): ఫేక్ ఎస్బీఐ యాప్‌తో సైబర్ మోసగాళ్లు ఖాతాదారుల నుంచి డబ్బులు కొట్టేసిన ఘటన నందిపేట్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండల కేంద్రంలో గురువారం ఎస్‌బీఐ నూతన బ్రాంచ్ ప్రారంభమయింది. కాగా మధ్యాహ్నం నుంచి పలువురు సెల్‌ఫోన్లకు వాట్సప్ ద్వారా ఎస్‌బీఐ యోనో యాప్ పేరిట కేవైసీని అప్‌డేట్ చేసుకోమని మెసేజ్ వచ్చింది. దీంతో కొందరు పొరపాటున ఆ లింక్‌పై నొక్కారు. వెంటనే యాప్ డౌన్‌లోడ్ అవడం అంతలోనే వాట్సాప్ హ్యాక్ కావడం అకౌంట్లో నుంచి డబ్బులు ఖాళీ అయినట్లు మెసేజ్ రావడం చకచకా జరిగిపోయాయి. ఇలా నందిపేటలోని రాంనగర్ కాలనీకి చెందిన బోడ రాజు అకౌంట్ నుంచి రూ. 6వేలు కాజేశారు. ఇలాగే పలువురి ఖాతాల నుంచి డబ్బులు మాయమయ్యాయి. కాగా రాజు వెంటనే మిగతా గ్రూప్ సభ్యులకు నా వాట్సప్ హ్యాక్ అయిందని తన పేరిట వచ్చిన బ్యాంకు లింకును ఎవరు ఓపెన్ చేయవద్దని సమాచారం అందించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

డీసీఎం వ్యాన్ బోల్తా



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమం సమీపంలో కామారెడ్డి–ఎల్లారెడ్డి రోడ్డుపై తవుడు లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ ప్రమాదవశాత్తు బోల్తా పడిందని గ్రామస్తులు గురువారం తెలిపారు. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపు వ్యాన్ వస్తుండగా బుధవారం రాత్రి శబరిమాత ఆశ్రమం వద్దగల మూలమలుపు వద్ద అదుపుతప్పి పల్టీలు కొట్టిందన్నారు. వాహనం అద్దాలను పగుల కొట్టి డ్రైవర్ బయటకు వచ్చి ప్రాణాలను కాపాడుకున్నాడన్నారు. ఎవరికి ప్రాణనష్టం జరగలేదన్నారు. మండలకేంద్రంలోని పలు మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని మూలమలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేసి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.